ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | 5





రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్

ముమ్మిడివరం నగర పంచాయతీ ఎరకాయ చెరువు వద్ద బీటలు వారుతున్న చేను



రబీ సాగుకు నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్‌లో ముంపునీరుతో వరి పంటకు నష్టం ఏర్పడడంతో ఇబ్బందులు పడ్డ రైతులు, ఇప్పుడు రబీలో సక్రమంగా నీరు అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వరి సేద్యంలో రైతులు నష్టపోతున్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి):

పంటకాల్వల నిర్వహణలో ఇంజనీరింగ్ అధికారుల వైఫల్యం

తూతూ మంత్రంగా మరమ్మతులు

ఏటా ఇదే పరిస్థితి



మాగాం-అయినాపురం పంట కాల్వలపై చిప్పలపాలెం వద్ద శిథిలావస్థకు చేరిన డ్యాం

రబీలో నీటి ఎద్దడి

సాగునీటి సమస్యతో ఇబ్బందులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కాల్వ నీరు ఆధారంగా లక్షా 88 వేల ఎకరాల్లో వరి సేద్యం జరుగుతోంది. అయితే ప్రస్తుత రబీలో లక్షా 65 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఖరీఫ్‌లో ముంపు సమస్యతో ప్రతీ ఏటా జిల్లాలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాల్లో 30 వేల నుంచి 40 వేల ఎకరాల్లో రైతులు నాట్లు వేయడం లేదు. అయితే ప్రస్తుత రబీలో సాగునీటి ఎద్దడి ఏర్పడడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అయినవిల్లి, అల్లవరం తదితర మండలాల్లో సాగునీటి ఇబ్బందిని రైతులు ఎదుర్కొంటున్నారు. కాల్వలకు సాగునీటి సరఫరాలో సరైన లెవల్ పాటించకపోవడం.. నీటిని క్రమబద్ధీకరించే డ్యామ్‌లు శిథిలావస్థకు చేరడం, పంటకాల్వల్లో తూడు, గుర్రపుడెక్క, చెత్తాచెదారం వంటివి పెరిగిపోవడం వల్ల సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు.



ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం సమీపంలో సాగునీరు అందక బీటలు వారిన వరిచేలు

ఆధునికీకరణకు నోచుకోక..

ఇరిగేషన్ అధికారులు పంటకాల్వల ఆధునికీకరణకు శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో కాల్వ శివారు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుఫాను, అల్పపీడనం వంటి కారణాల వల్ల గత నవంబరు, డిసెంబరు నెలలో కురిసిన వర్షాలతో ఖరీఫ్ వరి మాసూళ్లు ఆలస్యమయ్యాయి. దీంతో రబీ నాట్లకు కూడా తీవ్ర జాప్యం జరిగింది. నవంబరు నెలాఖరు, డిసెంబరు 20లోపు పడాల్సిన రబీ నాట్లు జనవరి నెలాఖరు వరకు రైతులు వేస్తూనే ఉన్నారు. కొంత మంది ముందుగా డిసెంబరు నెలలో వేసిన నాట్లు చిరుపొట్ట దశకు చేరుకోగా ఆలస్యంగా వేసిన వరినాట్లు పైరు పిలకలు తొడిగే దశలో ఉంది. ఈ దశలో వరికి నీటి ఎద్దడి ఏర్పడడంతో రైతులు నత్తగుల్లలు, ఆయిల్ ఇంజన్ల సహాయంతో పంటకాల్వ, మురునీటి కాల్వలోని నీటిని తోడుకుంటున్నారు. దీని వల్ల సేద్యం వ్యయం పెరిగిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అయినవిల్లి మండలం క్రావలో సాగునీరు అందక బీటలు వారుతున్న వరిచేలు

నష్టపోతున్న రైతులు

వరి సాగు వల్ల వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడం, దీనికితోడు తాగునీటి ఎద్దడితో నీటిని తోడుకోవాల్సి రావడం వంటి కారణాల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ముమ్మిడివరం, అయినవిల్లి మండల పరిధిలోని మాగాం-అయినాపురం పంటకాల్వకు తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పంటకాల్వలపై 4300 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. 11.86 కిలోమీటర్ల నిడివి గల ఈ పంటకాల్వను సరిగా ఆధునికీకరించకపోవడంతో ఏటా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. అయినవిల్లి మండల పరిధిలోని మాగాం, క్రావ, పోతుకుర్రు, శంకరాయగూడెం, ముమ్మిడివరం మండల పరిధిలోని క్రావ చింతలపూడి, క్రాపచింతలపూడిపాలెం, ముమ్మిడివరం, ఎరకాయచెరువు, సోమిదేవరపాలెం, అయినాపురం గ్రామాల్లో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ముందుగా వేసిన వరినాట్లు అంకురం వేసే దశలో ఉన్నాయి. దీంతో ఎలుకలు వరిని తీవ్రంగా నష్టపరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకాల్వను శాశ్వత ప్రాతిపదికన ఆధునికీకరించి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి సమస్య పరిష్కరిస్తాం

లెవెల్స్ పెంచి పొలాలకు నీరందిస్తాం
ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్

ఐ.పోలవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రబీ పంటకు సాగునీరందించి సమస్యను పరిష్కరిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ హామీ ఇచ్చారు. సాగునీరందక ఎండిపోతున్న దాళ్వా పొలాలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలకు ఇరిగేషన్ యంత్రాంగం స్పందించింది. ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ సోమవారం మండలంలో పర్యటించి ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. జి.వేమవరం, జి.మూలపొలం, టి.కొత్తపల్లి ప్రాంతాల్లో పర్యటించి నీటి ఎద్దడిని స్వయంగా తెలుసుకున్నారు. మండలంలో రెండు వేల ఎకరాల్లో దాళ్వా పైరు నీరు లేక ఎండిపోతున్నట్టు జి.వేమవరం సర్పంచ్ నల్లా సుదర్శన్‌తో పాటు రైతులు కొండమూరి విజయబాబు, మద్దింశెట్టి రాజబాబు తదితరులు సాగునీటి ఇక్కట్లను ఎస్ఈకి వివరించారు. కనీసం ఎరువులు వేసుకుందామంటే నీరు సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడి నివారణకు డ్రెయిన్స్‌పై అడ్డుకట్టలు వేసేందుకు చర్యలు తీసుకున్నట్టు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు చిలువూరి సుబ్బరాజు, నీటి సంఘం అధ్యక్షుడు బోడిశెట్టి నాగబాబు, ఇరిగేషన్ ఏఈ ఈశ్వర్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు



అంబాజీపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ రైతు సేవా కేంద్రాలకు అందించిన కియోస్క్ యంత్రాలు మూలకు చేరాయి. రైతులు ఎరువులు బుక్ చేసుకుని నేరుగా పొందేందుకు ఉపయోగపడే విధంగా గత ప్రభుత్వ హయాంలో వీటిని కోట్లాది రూపాయలు వెచ్చించి కేటాయించారు. అయితే జిల్లాలో సగానికి పైగా వీటిని పక్కన పెట్టేశారు. రైతు సేవా కేంద్రాలకు సొంత భవనాలు లేనప్పటికి ప్రతి కేంద్రానికి వీటిని అందించారు. పలు కారణాలతో జిల్లాలో అధిక శాతం యంత్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

జిల్లాకు 455 కియోస్క్ యంత్రాలు..

జిల్లాలో ఉన్న 455 రైతు సేవా కేంద్రాలకు గత వైసీపీ ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను అందించింది. ఒక్కో యంత్రానికి సుమారు రూ.72 వేలు ద్వారా వీటిని రూ.3.27 కోట్లతో కొనుగోలు చేశారు. వీటి ద్వారా అధికారులు, వ్యవసాయ సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే ఆర్‌ఎస్‌కేలకు వచ్చి స్వయంగా వారికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అవసరమైన పరిమాణంలో కియోస్క్ యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. మార్కెట్లో పంటల ధరలు, వాతావరణ మార్పులు తదితర విషయాలను రైతులు తెలుసుకునే సౌలభ్యం ఈ యంత్రాలలో ఉంది. కాని గత ప్రభుత్వం యంత్రాలను ఏర్పాటు చేసినా రైతులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంచకపోవడంతో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. అలాగే జిల్లాలో 300 గ్రామ సహాయ వ్యవసాయాధికారుల పోస్టులు ఉండగా 256 మంది మాత్రమే ఉద్యోగులు ఉండటంతో వారి స్థానంలో మిగిలిన రైతు సేవా కేంద్రాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబును వివరణ కోరగా జిల్లాలో యంత్రాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎరువులు అందుబాటులో లేకపోవడంతో వాటిని ఉపయోగించడం లేదన్నారు. రైతు సేవా కేంద్రాలకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచి ఈ యంత్రాలను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.



రాయవరం మండలంలో మురుగుకాల్వకు వేసిన క్రాస్‌బండ్ (ఫైల్‌ఫొటో)

70 చోట్ల క్రాస్‌బండ్లు

రూ.92 లక్షలతో నిర్మాణం

మండపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దాళ్వా సాగుకు సంబంధించి రైతులకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న మురుగు కాల్వలపై 70 చోట్ల క్రాస్ బండ్లను రూ.92 లక్షలతో నిర్మించాలని మురుగునీటి పారుదల డిపార్ట్‌మెంట్ ప్రణాళిక సిద్ధం చేసింది. సాగునీటి ఎద్దడికి సంబంధించి ప్రతియేటా ఫిబ్రవరి మొదటి వారంలోనే డ్రైన్లకు క్రాస్‌బండ్లు ఏర్పాటు చేస్తారు. కానీ ఈ ఏడాది ఆ ప్రక్రియకు కొస్తంత ఆలస్యం అయ్యింది. జిల్లాలో ఉన్న 22 మండలాల్లో మేజర్, మైనర్ డ్రైన్లపై రైతుల అవసరాలను బట్టి క్రాస్ బండ్లు ఏర్పాటు చేస్తామని డ్రైనేజీ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అమలాపురం, రాజోలు, సఖినేటిపల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం, మామిడికుదురు, కొత్తపేట, ఆత్రేయపురం, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, కె.గంగవరం, పి.గన్నవరం, మలికిపురంతో పాటు పలు మండలాల్లో డ్రైన్లలో సాగుకు పనిచేసే నీరు బయటకు వెళ్లకుండా నీరును నిల్వ చేసి వరి పంటకు సాగునీరు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి ఫిబ్రవరి రెండో వారం నుంచే సాగునీటి ఎద్దడి ఛాయలు కోనసీమ టైలాండ్ భూముల్లో కనిపిస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఒక్క ఐ.పోలవరం మండలంలోనే 30 వరకు క్రాస్‌బండ్లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అవసరాలను బట్టి 70 ఏరియాలను గుర్తించామని అక్కడ క్రాస్‌బండ్లను ఏర్పాటు చేస్తామని మురుగునీటి పారుదల శాఖ ఈఈ కిశోర్ తెలిపారు. ఇప్పటికే క్రాస్ బండ్ల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామని, పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కోనసీమ జిల్లాలకు సంబంధించి అమలాపురం, రాజోలు, రామచంద్రపురం, కాకినాడ సబ్ డివిజన్లకు సంబంధించిన డ్రైన్లపై క్రాస్‌బండ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పాత బకాయిల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

క్రాస్‌బండ్ల నిర్మాణానికి సంబంధించి బకాయిలు పేరుకుపోతున్నాయి. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం క్రాస్‌బండ్లకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్లను అభ్యర్థించి పనులు చేసేలా ఒప్పిం చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో డ్రైనేజీ శాఖకు సంబంధించి 2018 నుంచి ఇప్పటివరకు సుమారు క్రాస్‌బండ్ల బిల్లులు పెండింగ్ రూ.12 కోట్ల వరకు ఉంటుందని మురుగునీటి పారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కేవలం కోనసీమ జిల్లాకు సంబంధించిన బకాయిలే మేజర్ అంటే రూ.6 కోట్లుపైనే ఉంటాయని చెప్పారు.

వేర్వేరు చోట్ల బాలికలపై అత్యాచారం..

అనాతవరంలో బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం చేసిన వ్యక్తి

మండపేటలో మరో బాలికపై ఆటోడ్రైవర్ అఘాయిత్యం వార్తలు..7లో

తునిలో.. వై..చీప్ ట్రిక్స్!



తుని మునిసిపల్ కార్యాలయ భవనం

తుని వైస్ చైర్మన్ ఎన్నికలో వైసీపీ డ్రామాలు

- వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరు
- ఇప్పటికే మూడుసార్లు వాయిదా
- పాగాకు వైసీపీ.. టీడీపీ పట్టు
- టీడీపీలో 10 మంది ఫ్యాన్ కౌన్సిలర్లు
- మిగిలిన 17 మంది ఎటు వైపో..
- ఆందోళనలో వైసీపీ నాయకులు
- ఎన్నికకు హాజరుకాకుండా నిర్బంధం
- చైర్‌పర్సన్ ఇంట్లో బంధించిన రాజా
- నేడు నాలుగోసారి ఎన్నిక
- కోరం లేక.. రెండుసార్లే వాయిదా
- తరువాత కోరం అవసరమేలేదు

కాకినాడ/తునిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని తుని మునిసిపాలిటీలో వైస్‌చైర్మన్ ఎన్నిక వ్యవహారం రకరకాల మలుపులు తిరుగుతోంది. ఎలాగైనా ఈ కుర్చీలో పాగా వేయాలని టీడీపీ, మిగిలిన సభ్యులు చేజారిపోకుండా కాపాడుకోవాలని వైసీపీ ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. దీంతో కోరం లేక సోమవారం జరగాల్సిన ఎన్నిక మూడోసారీ రద్దయింది. తిరిగి మంగళవారం నాలుగోసారి ఎన్నిక నిర్వహించనున్నారు. ఈసారి కూడా మళ్లీ కోరం డ్రామా కొనసాగుతుందా? లేదంటే ఎన్నిక జరుగుతుందా? అనేది సస్పెన్స్‌గా మారింది. ఈ ఎన్నిక ఎలాగైనా నిర్వహించాలని హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ ఎన్నికకు హాజరుకాకుండా వ్యవహరిస్తుండడం విశేషం.

మూడోసారీ అదే డ్రామా..

తుని మునిసిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నిక మూడోసారి సోమవారం జరుగుతుందని అంతా భావించారు. కుర్చీ ఏ పార్టీ ఖాతాలో పడుతుందోనని రకరకాల లెక్కలు వేశారు. తీరా యథావిధిగా కోరం లేకపోవడంతో ఎన్నిక రద్దయింది. దీంతో అంతా ఉసూరుమనాల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఉదయం 11 గంటలకు ఎన్నిక నేపథ్యంలో ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరిన 10 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. దీంతో టీడీపీవైపు పూర్తి హాజరు ఉంది. వైసీపీ నుంచి 17 మంది కౌన్సిలర్లు హాజరవుతారని అధికారులు భావించారు. కానీ సమయం మించిపోతున్నా వైసీపీ కౌన్సిలర్లు మాత్రం రాలేదు. వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ తన నివాసంలో వీరందరినీ దాచేయడంతో వీరంతా ఎన్నికకు రాలేని పరిస్థితి. మరోపక్క మాజీ మంత్రి దాడి శెట్టి రాజా సైతం సోమవారం నాటి ఎన్నిక వాయిదా పడేలా ముందు నుంచీ కథ నడిపారు. అక్కడకు తుని పట్టణ వ్యాప్తంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను రాజా మోహరించారు. టీడీపీ నుంచి ప్రతిఘటన వస్తే ఎదుర్కొనేందుకు వీలుగా వారిని గొడవకు సిద్ధంచేశారు. అదే సమయంలో టీడీపీ నేతలు చైర్‌పర్సన్ నివాసానికి సమీపానికి వచ్చి ఆందోళన చేపట్టారు. ఎన్నిక జరగకుండా రాజా అడ్డుకుం టున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లను స్వేచ్ఛగా సమావే శానికి రానీయకుండా ఓటమి భయంతో నిర్బంధించారని మండిపడ్డారు. దీం తో రాజా, ఆయన అనుచరులు టీడీపీ నేతలతో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగిం ది. దీంతో ఉద్రిక్తతకు దారితీసింది. ఆటు గొడ వను కట్టడి చేయడానికి ప్రయత్నించిన పోలీ సులపై రాజా దురుసుగా వ్యవహరించారు. టీడీ పీకి అను కూలంగా పోలీసులు ఉన్నారంటూ వారిపైకి గొడవకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గం టల వరకు వేచిచూసిన అధికారులు సగం మం ది సభ్యులైన 15 మంది కూడా లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

వైసీపీ ప్రస్తుత వ్యూహం.. కూటమికే ప్రయోజనం?

నిబంధనల ప్రకారం మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి కోరం లేకపోతే రెండు సార్లు మాత్రమే ఎన్నిక వాయిదా వేయొచ్చు. ఆ తర్వాత కోరంతో సంబంధం లేకుండా ఎంతమంది సభ్యులు ఎన్నికకు హాజరైతే వారితోనే ఎన్నిక ప్రక్రియ నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఇప్పటివరకు మూడు సార్లు ఎన్నిక రద్దవగా, అందులో రెండుసార్లు శాంతి భద్రతల సమస్య కారణంగా వాయిదా వేశామని, సోమవారం మాత్రమే కోరం లేని కారణంగా ఎన్నిక రద్దయిందని అధికారులు చెబు తున్నారు. మంగళవారం కూడా ఇదే కారణం తో ఎన్నిక వాయిదా వేస్తే ఆ తర్వాత మాత్రం హాజరైన సభ్యులతో ఎన్నిక నిర్వహించవచ్చు. మంగళవారం ఎన్నికకు ఎలాగూ టీడీపీ నుంచి 10 మంది కౌన్సిలర్లు హాజరవుతారు. వీరుకాకుండా మరో నలుగురు కౌన్సిలర్లు హాజరైతే తగిన కోరంతో ఎన్నిక జరపవచ్చు.

నేడైనా తేలేనా..

తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక తిరిగి నేడు(మంగళవారం) నాలుగోసారి జరగనుంది.ఈ మేరకు ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం నాటి ఆందోళనల నేపథ్యంలో మంగళవారం సైతం పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ జిల్లా నలుమూలల నుంచి బలగాలను దించుతున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.తునిలో మంగళవారం జనం గుమిగూడడం, ఆయుధాలతో సంచరించడాన్ని నిషేధిస్తూ కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు. మరోపక్క తమ కౌన్సిలర్లను ఎన్నికకు హాజరుకాకుండా అడ్డుకుంటున్న వైసీపీ తిరిగి మంగళవారం ఎన్నిక నేపథ్యంలో చలో తునికి పిలుపునివ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే 10 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోవడం, మరికొందరు అదే దారిలో ఉండడంతో ఓడిపోతామనే భయంతో ఎన్నిక జరగకుండా ఎలాగైనా చూడాలని వైసీపీ భావిస్తోంది. ఈ వైసీపీ తీరునే టీడీపీ తప్పుబడుతోంది.



తుని మునిసిపల్ కార్యాలయం వద్ద టీడీపీ కౌన్సిలర్లను కౌన్సిల్ హాలులోకి పంపుతున్న పోలీసులు



చైర్మన్ నివాసం వద్ద టీడీపీ నాయకులతో మాజీ మంత్రి రాజా వాగ్వాదం

'చలో తుని'కి అనుమతి లేదు..

చలో తునికి ప్రభుత్వపరంగా ఎటువంటి అనుమతులు లేవు. చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. సోమవారం జరగాల్సిన ఎన్నిక కోరం సరిపోకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది. కౌన్సిలర్లకు కావాల్సిన పోలీసు రక్షణ ఉంటుంది. స్వేచ్ఛ గా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ముందుకు రావాలి. - శ్రీహరిరాజు, పెద్దాపురం డీఎస్పీ

మాజీ మంత్రి రాజాపై కేసు

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ స్పష్టంచేశారు. తుని మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో కౌన్సిలర్లు ఓటు వేయకుండా అడ్డుకోవడంతో పాటుగా టీడీపీ నేత పోలిశెట్టి రామలింగేశ్వరరావుపై మాజీ మంత్రి దాడిశెట్టి రాజా దాడి చేయడంపై వచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. వైస్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్లు స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు ముందుకు రావాలని, పోలీసు రక్షణ అవసరమైతే తుని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



పురుషుల విభాగంలో హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్



మహిళల విభాగంలో...

నువ్వా...నేనా!

కాకినాడలో మూడో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు సోమవారం మూడో రోజుకు చేరుకుంది. మహిళలు, పురుషుల విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. మహిళల విభాగంలో ఒడిశా సెక్రటేరియట్, హర్యానా సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 8-0 తేడాతో గెలుపొందింది. ఉత్తరాఖండ్, ఢిల్లీ తలపడగా ఉత్తరాఖండ్ టీమ్ 4-0 తేడాతో గెలుపొందింది. బిహార్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన పోరులో బిహార్ 15-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఛత్తీస్‌గఢ్ జట్లు తలపడగా సెంట్రల్ సెక్రటేరియట్ 7-0 తేడాతో గెలు పొందింది. రాజస్థాన్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ నడుమ జరిగిన సమరంలో మధ్యప్రదేశ్ టీమ్ 2-0 తేడాతో పైచేయి సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ టీమ్ 11-0 తేడాతో గెలుపొందింది.


పురుషుల విభాగంలో... ఆర్ఎస్బీ చెన్నై, ఆర్ఎస్బీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ చెన్నై టీమ్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ అహ్మదాబాద్, ఆర్ఎస్బీ ఇండోర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్లు 2-2 గోల్స్ నమోదు చేయడంతో డ్రా అయ్యింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి.భానుమూర్తిరాజు ముఖ్య అతిథిగా హాజరు కాగా సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు దేవులనాయక్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.







క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ స్కూల్ గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి రాజు, పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు దేవులనాయక్. చిత్రంలో డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు



ఇండియా తరపున ఆడుతున్నందుకు

గర్వపడుతున్నా

సోనికా

ఏషియన్ గేమ్స్ హాకీ గోల్డ్ మెడలిస్ట్, ఢిల్లీ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్

ఇండియా తరఫున హాకీ టీమ్‌లో ఆడుతున్నందుకు ఎంతో గర్వపడుతున్నాను. 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్, అదే సంవత్సరం ఏషియన్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాను. 2023లో జరిగిన చాంపియన్‌షిప్‌లో ఇండియా టీమ్‌లో మిడ్ ఫీల్డర్‌గా ఆడాను. ఆ గేమ్స్‌లో ఇండియా మొదటి స్థానంలో నిలవడంతో గోల్డ్ మెడల్ సాధించాము. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి కాకినాడ వచ్చి ఆడుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి



ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ సోనికాకి బహుమతి అందజేస్తున్న కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి విచ్చేసిన ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ సోనికాని కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర ప్రసాద్ కడియాల సోమవారం సత్కరించారు. ఆమెకు బహుమతి అందించారు. అంతర్జాతీయ హాకీ ఒలింపిక్స్ చాంపియన్‌షిప్‌కి ప్రిపేర్ అవుతున్న అర్జున అవార్డు గ్రహీత మహమ్మద్ రియాజ్ కుమార్తె సమీనా రియాజ్‌కు ప్రోత్సాహకంగా రూ.లక్ష చెక్కు అందజేశారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో జిమ్నాస్టిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారునికి రూ.25వేలు చెక్కును క్లబ్ తరపున అందించారు. కార్యక్రమంలో ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్ టీం హెడ్ కోచ్ రాజ్‌కుమార్ వర్మ, కోచ్ రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చాలా తక్కువ సమయంలో ఏర్పాట్లు చేశాం

బి.శ్రీనివాసకుమార్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, కాకినాడ జిల్లా



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కి చాలా తక్కువ సమయంలో ఏర్పాట్లు పూర్తిచేశాం. కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతోనే గేమ్స్ ఇక్కడ జరగడానికి అవకాశం దక్కింది. 20 రోజులు ముందే అనుమతి రావడంతో కలెక్టర్ చైర్మన్‌గా 13 కమిటీలు వేశాము. ప్రతి కమిటీలో ఒక చైర్మన్‌తో పాటు సభ్యులు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ కమిటీలను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తుండగా డీఆర్వో వెంకటరావు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. 25 నుంచి లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ రోజు నుంచే నాకౌట్ మ్యాచ్‌లు మొదలవుతాయి. 26న క్వార్టర్ ఫైనల్, 27న సెమీఫైనల్, 28న ఫైనల్‌తో పాటు క్వార్టర్ ఫైనల్స్ సెమీ ఫైనల్‌లో రెండు ప్లేస్‌ల్లో నిలిచిన రెండు జట్ల మధ్య మూడో స్థానం కోసం మ్యాచ్ ఉంటుంది. క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా చూసేందుకు సుమారు 200 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. దేశంలోని అతిపెద్ద టోర్నమెంటు కాకినాడలో జరగడం సంతోషించాల్సిన విషయం. మెడల్స్ సాధించిన వారికి ఆయా డిపార్ట్‌మెంట్స్ నుంచి ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్లు కూడా ఇస్తారు. 22 కంపెనీల స్పాన్సర్‌షిప్‌తో టోర్నమెంటును ఘనంగా నిర్వహిస్తున్నాము.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి

వైభవంగా శివకేశవుల ప్రతిష్ఠోత్సవం

- ఇర్రిపాకలో ఆధ్యాత్మిక శోభ
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



శివకేశవుల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వర స్వామికి హారతి

జగ్గంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఏలేరు నదీ తీరాన శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు కర్తలుగా పాల్గొనగా ప్రసన్న వేంకటేశ్వర స్వామి, కోటిలింగేశ్వరుడు విగ్రహాల ప్రతిష్ఠ కుమ్మరిలోవ తపోవనం పీఠాధిపతి సచ్చిదానందస్వామి, శృంగేరీ పీఠం ఆంధ్ర-తెలంగాణ ప్రచారకర్త బంగారయ్యశర్మ, శృంగేరీ పీఠం వారణాసి ఇన్‌చార్జి ఇంద్రగంటి సత్యం, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జరిగింది. జ్యోతుల నవీన్-లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు-సునీత దంపతులు, జ్యోతుల నెహ్రూ మనవడు అనీష్ నెహ్రూ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, దాట్ల బుచ్చిబాబు, వరుపుల సత్యప్రభ, టీటీడీ పాలక మండలి సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, జెంగళూరు దర్శన్, కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, ఎస్వీఎస్ఎన్ వర్మ, మాజీ ఎమ్మెల్సీలు చిక్కాల రామచంద్రరావు, ఆదిరెడ్డి అప్పారావు, చైతన్యరాజు, అనంత ఉదయభాస్కర్, టీడీపీ నేత వాసిరెడ్డి ఏసుదాసు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జి వర్మ, రాజమహేంద్రవరం మాజీ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, సూరంపాలెం బాలు, ఎల్లపు దొరబాబు, మాదారపు వీరబాబు, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, గోకేడ ప్రసాద్, కర్నాకుల సూరిబాబు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వచ్చిన వారంతా శివకేశవులను దర్శించుకుని అన్న, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రతిష్ఠ జరిపిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామి

పండ్ల గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం

- దివాన్‌చెరువు ఫ్రూట్స్ మార్కెట్‌లో ఘటన
- గొడౌన్‌లో చెలరేగిన మంటలు
- పలు రకాలు పండ్లు సహా రెండు బైకులు దగ్ధం
- మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది



మంటల్లో కాలిపోతున్న గొడౌన్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్‌లో ఓ గొడౌన్ అగ్నికి ఆహుతైంది. దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌లో ఇనుప రేకులతో వేసిన అరాద్యుల శ్రీనివాసరావు(ఏఎస్ఆర్)కు చెందిన పండ్ల గిడ్డంగిలో సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో లోపల ఉన్న ప్లాస్టిక్ ట్రేలు అంటుకుని అమ్మకం కోసం నిల్వచేసిన ఆపిల్, దానిమ్మ, కర్బూజ, డ్రాగన్ తదితర రకాల పండ్లు కాలిపోయాయి. వాటితోపాటు సమీపంలోని పండ్ల దుకాణంలో ఉంచిన రెండు బైకులు కాలిపోయాయి. స్థానికులు రాజమహేంద్రవరంలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఈ.స్వామి, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్‌తో బాటు ఆర్యాపురం, ఇన్నీసుపేట, కొవ్వూరుల నుంచి మూడు అగ్నిమాపక శకటాలు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 లక్షలు విలువ చేసే పండ్లు, 15 వేల ట్రేలు, గిడ్డంగి దగ్ధమయ్యిందని, సుమారు రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు శ్రీనివాసరావు చెప్పారు. కాగా కాల్చి పడేసిన సిగరెట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నామని, ఆస్తి నష్టం సుమారు రూ.25 లక్షలు ఉండొచ్చని అగ్నిమాపక శాఖాధికారులు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, వైసీపీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్, డీఎస్పీ భవ్య, బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ పరిశీలించారు. గిడ్డంగి యజమాని, అగ్నిమాపక అధికారులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. బాధితుడితో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అన్నారు. పండ్ల గిడ్డంగిలో ప్రమాదం మానవ తప్పిదం వల్లే జరిగిందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీలో కార్మిక శాఖ మంత్రి సుభాష్
- హాజరుపట్టీ పరిశీలన... రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా
- విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు చార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశం



ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉద్యోగుల హాజరును పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం చూపితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టీని పరిశీలించిన ఆయన విధులకు గైర్హాజరైన ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, మరికొంతమంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు చార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ, సిబ్బంది రోగుల పట్ల అనుసరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసి భారీగా నిధులు కేటాయిస్తోందని, ఇందులో భాగంగా రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు త్వరలోనే సమకూరుతాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

కాకినాడ ఆర్ఎంసీలో

నేడు, రేపు మాక్ డ్రిల్

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో మంగళ, బుధవారాల్లో తీవ్రవాద చర్యల నిరోధక సంస్థ ఆక్టోపస్ మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. 2రోజుల పాటు జరిగే ఈ మాక్‌డ్రిల్‌లో ఆకస్మికంగా టెర్రరిస్టులు దుశ్చర్యలకు పాల్పడితే తిప్పికొట్టే చర్యలపై శిక్షణనివ్వనున్నారు. మాక్‌డ్రిల్ నిర్వహించడంతో పాటు రెక్కీ నిర్వహించాల్సిన విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నారు.

ప్రేమించి.. పెళ్లి చేసుకోనని..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లికి ముఖం చాటేయడంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పిడింగొయ్యికి చెందిన ఎల్.కుమార్ మత్స్యకార వలల వ్యాపారం చేస్తుంటాడు. మూడేళ్ల క్రితం షెల్టాన్ హోటల్ సమీపంలోని ఓ యువతితో పరిచయం ఏర్పడింది. అయితే తాము అప్పటి నుంచీ ప్రేమించుకుంటున్నామని, పెళ్లి విషయం వచ్చేసరికి అతడు ఒప్పుకోవడం లేదని యువతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్త సందోహం

- ఘనంగా వీరభద్రుడి సంబరం
- వేళంగికి పోటెత్తిన భక్తులు

కరప, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో సోమవారం వీరభద్రుడి సంబరం ఘనంగా జరిగింది. రెండేళ్లకోసారి మాఘమాసం మూడో సోమవారంనాడు దాలిపర్తి గోవిందు కుమారులు ఈ వీరభద్రుడి సంబరాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తజనం తరలిరాగా కుమ్మర్ల గద్దె నుంచి స్వామివారిని ఊరేగించారు. చెరువుగట్టు మీద జమ్మిపూజ చేసిన అనంతరం సంప్రదాయాలను అనుసరించి తలపై వీరభద్రుడి ప్రతిమలను పెట్టుకుని ప్రభలతో తిరిగి గద్దెకు చేరుకున్నారు. వీరభద్రుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తదనంతరం భారీ అన్నసంతర్పణ, రాత్రికి సంబరం జరిగింది. వీరభద్రుడి ఊరేగింపు సందర్భంగా వేళంగి ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరప పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను మళ్లించడంతో పరిస్థితి చక్కబడింది.



వేళంగిలో భారీ జనసందోహం నడుమ వీరభద్రుడి ఊరేగింపు

గంజాయి కేసులో ఐదుగురి అరెస్ట్

ప్రధాన నిందితుడు పరారీ

కోరుకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గంజాయిని సేకరించి విక్రయాల కోసం విభజించుకుంటుండగా పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి సుమారు రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వైశ్రీకాంత్ సోమవారం సాయంత్రం తెలిపారు. కోరుకొండ మండలం జంబూపట్నం పంచాయతీ పరిధిలో అయ్యన్నగర్ల సమీపంలోని రోమ్ సిటీ వద్ద ఐదుగురు వ్యక్తులు ఒక గంజాయి మూటతో ఉండగా వారిని విచారించి సోదా చేయగా వారి వద్ద సుమారు 2 కిలోల గంజాయి లభించిందన్నారు. కోరుకొండకు చెందిన గంటివాడ లోవరాజు, గోకరకొండ నరేంద్ర, కామిశెట్టి చరణ్‌కుమార్, శ్రీరాంపురం గ్రామానికి చెందిన గోలుకొండ చంద్రదుర్గ, శ్రీరంగపట్నానికి చెందిన నడిపల్లి అంజిసాయిలను అరెస్ట్ చేశామన్నారు. ప్రధాన నిందితుడు, జంబూపట్నం గ్రామానికి చెందిన కొళ్ల నరేష్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ వైసత్యకిషోర్, ఎస్ఐ డీవీఎస్ఎస్ శ్యామ్‌సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించేందుకే 'చలో తుని'కి పిలుపు


తుని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

- తుని మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాపై కూటమి నాయకుల ధ్వజం

తుని రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తునిలో అల్లర్లు సృష్టించేందుకే వైసీపీ నాయకుడు దాడిశెట్టి రాజా చలో తునికి పిలుపునిచ్చాడని కూటమి నేతలు ధ్వజమెత్తారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ పోలీసులు వచ్చి ఎన్నికలు సజావుగా జరగాలని ప్రయత్నిస్తే వారిపై ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నావని నిలదీశారు. వైసీపీ కౌన్సిలర్లను టీడీపీ నేతలు కిడ్నాప్ చేయలేదని, వారిని దాడిశెట్టి రాజాయే కిడ్నాప్ చేశారంటూ వారి కుటుంబసభ్యులు తమ వద్దకు వచ్చి గోడు వెలిబుచ్చుకుంటున్నారని తెలిపారు. కాపులపై కేసులు పెట్టించింది సీఎం చెన్నకేశవరావు కాదని, మీ పక్కనే ఉన్న యనమల కృష్ణుడని గుర్తుచేసుకోవాలని కోరారు. ప్రశాంతంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు సహకరిస్తే తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవి టీడీపీ ఖాతాలో పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, బోనం చినబాబు, తమరాన సత్యనారాయణ, గంటల సత్యనారాయణ పాల్గొన్నారు.

'చలో తుని'కి రండి.. జయప్రదం చేయండి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైసీపీ కార్యకర్తలకు కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపు

తుని రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చలో తుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల వైసీపీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సోమవారం తునిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కౌన్సిలర్లను టీడీపీ నాయకులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, తాను వచ్చి అడ్డుకున్నానని అన్నారు. 17మంది కౌన్సిలర్లతో సంతకాలు చేసి ఎన్నికల అధికారికి అందజేశామని, నేడు జరిగే ఎన్నికలో కలెక్టర్, ఎస్పీ సమక్షంలో ఎన్నికకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు మాట్లాడుతూ అసలు తునిలో ప్రజాస్వామ్యం ఉందా అంటూ ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణితోపాటు పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు.

క్షణికావేశంలో
భర్తపై దాడి

- కూలి డబ్బుల విషయమై భార్యభర్తల మధ్య వివాదం
- భార్యపై దాడి చేయబోయిన భర్త
- తప్పించుకుని భర్తపై కత్తితో దాడి చేసిన భార్య
- ఆపై అతడ్ని ఆస్పత్రిలో చేర్పించిన వైనం
- శంఖవరం మండలం పెదమల్లాపురంలో ఘటన


గాయపడిన దానేశ్వరరావు

శంఖవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తనపై కత్తితో దాడి చేసేందుకు వస్తున్న భర్తను ఆపి.. అదే కత్తితో భార్య తిరిగి నరికింది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి ఆమె వెంటనే ఆస్పత్రికి తరలించింది. కాకినాడ జిల్లా శంఖవరం మండలం పెదమల్లాపురంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదమల్లాపురానికి చెందిన తిన్నింటి దానేశ్వరావుకు, భార్య సన్యానమ్మ దంపతులు. వీరి మధ్య సోమవారం కూలి డబ్బుల విషయంలో మాటామాటా పెరిగింది. కష్టపడి సంపాదించిన డబ్బుతో మద్యం తాగేస్తుండడంపై భర్తను ఆమె గట్టిగా నిలదీసింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ ఘటనలో భార్యపై భర్త కత్తితో దాడికి తెగబడబోయాడు. ఈ సమయంలో ఆమె ఆ కత్తి లాక్కొని భర్త పీకపై సన్యానమ్మ ఒక్కవేటు వేసింది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి ఆమె వెంటనే స్థానికుల సహాయంలో అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించి దగ్గరుండి వైద్యం చేయించింది. కాగా, దానేశ్వరరావుకు ఏ ప్రమాదం లేదని, దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని, ప్రాథమిక విచారణ చేస్తున్నామని అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న
రెండు బైక్‌లు

- భర్త మృతి.. భార్యకు గాయాలు
- మడికి-దుళ్ల రహదారిలో ఘటన

ఆలమూరు/కడియం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో భర్త మృతిచెందగా భార్యతోపాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన గంటా రాజు(27), అతడి భార్య కుమారి కొత్తపేట మండలం మందపల్లిలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరు మడికి- దుళ్ల రోడ్డులోకి వచ్చేసరికి వీరి వాహనాన్ని మరో మోటారుసైకిల్ ఢీకొంది. దీంతో రాజు, కుమారిలకు తీవ్రగాయాలవ్వగా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌లో ఎక్కించేలోపు రాజు మృతిచెందగా కుమారి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా రాజు దంపతులకు ఏడాది వయస్సు ఉన్న ఓ కుమార్తె ఉంది. అతడు కేశవరంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని స్థానికులు తెలిపారు. దీనిపై ఆలమూరు ఎస్‌ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్రేయపురం పూతరేకుల కేంద్రాలపై..
ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

- 160 కిలోల కల్తీనెయ్యి స్వాధీనం
- పూతరేకులు, నెయ్యి శాంపిల్స్ పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు..
- ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు


ఆత్రేయపురంలో కల్తీనెయ్యి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నకల్తీనెయ్యి షాపులపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆత్రేయపురంలో తయారు చేస్తున్న పూతరేకుల్లో విచ్చలవిడిగా కల్తీనెయ్యి వాడుతున్నారనే ఆరోపణలపై రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ కమిషనరు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫుడ్‌సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు రొక్కయ్య, సుబ్బారావు, ప్రసాద్, శ్రీకాంత్‌చౌదరిల బృందం ఏకకాలంలో వేర్వేరుగా కల్తీనెయ్యి అమ్ముతున్న షాపులు, పూతరేకుల తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారని తద్వారా ప్రజల ఆరోగ్యం గుల్లవుతుందన్న ఆరోపణలపై ఈ బృందం దాడులు నిర్వహించింది. ఆత్రేయపురం, రేవు సెంటర్‌ల్లో వివిధ షాపులపై దాడులు చేశారు. డ్రైఫ్రూట్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా ప్లాస్టిక్‌కవర్లలో ఏ కంపెనీ బ్రాండ్లు లేని కల్తీ నెయ్యిగా అనుమానించిన 160కిలోల నాసిరకం నెయ్యిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పూతరేకుల తయారీ కేంద్రంలో పూతచుట్టలను సీల్డ్‌కవర్లలో భద్రపరిచారు. నెయ్యి, పూతరేకులను హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తున్నట్లు తద్వారా వచ్చే రిపోర్టు ఆధారంగా షాపులు, ఆయా వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు చేపడతామని కంట్రోలర్ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు షాపులపై దాడులు నిర్వహించారు.

ఆరోగ్యాలపై చెలగాటం ఆడితే చర్యలు

కల్తీ నెయ్యి తయారు చేస్తున్న స్వీట్లను ప్రజలకు అమ్మితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్ హెచ్చరించారు. పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఆరోగ్యాలను కాపాడుకోవాలని, బ్రాండ్లు లేని నెయ్యితో పూతరేకులు తయారు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ లైసెన్సు తీసుకుని ప్రతి షాపులో తప్పనిసరిగా ప్రదర్శించాలని, నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం 8 శాంపిల్స్ సేకరించామని, 160 కిలోల నాసిరకంగా నెయ్యిగా అనుమానించి స్వాధీనం చేసుకుని భద్రపరిచామన్నారు. ల్యాబ్‌కు పంపిన నివేదిక ఆధారంగా చర్యలు తప్పవన్నారు. త్వరలోనే మరిన్ని దాడులు చేపడతామన్నారు.

బాలిక కిడ్నాప్.. ఆపై అత్యాచారం

- ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంమండలం అనాతవరంలో 8వ తరగతి చదువుతున్న 15ఏళ్ల బాలికను ఓ వ్యక్తి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. దీనికి సంబంధించి ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ అలియాస్ బులిచంటి సోమవారం స్కూల్‌కు వెళ్తున్న బాలికను మాయమాటలు చెప్పి బలవంతంగా మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని కిడ్నాప్ చేశాడని, ఆమెను అమలాపురం వైపు తీసుకువెళ్లి అక్కడఒక నివాసగృహంలో ఆమెపై అత్యాచారంచేశాడని తెలిపారు. బాలిక స్కూలుకు రాకపోవడం, ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై తీసుకువెళ్లిన విషయాన్ని తోటి విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందించారు.ఆయన విద్యార్థిని తండ్రికి ఫోన్‌లో విషయాన్ని తెలియచేశారు. దీంతో విద్యార్థిని తండ్రి విషయాన్ని ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జ్వాలాసాగర్ గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే నిందితుడు దుర్గాప్రసాద్ అమలాపురం ఎర్రవంతెనవద్ద బాలికను బస్సు ఎక్కించి పరారయ్యాడు. ఈ మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారం

- మండపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు

మండపేట, ఫిబ్రవరి, 17(ఆంధ్రజ్యోతి) మండపేటలో పదో తరగతి బాలికపై ఓ ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. మండపేట పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట పట్టణంలోని గొల్లపుంతకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ క్రాంతికుమార్(25)కు భార్య, కుమారుడు ఉన్నారు. మండపేట పట్టణంలోనే పదో తరగతి చదువుతున్న ఓ బాలికతో అతడికి పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ సురేష్ విలేఖరులకు తెలిపారు.

టిప్పర్ ఢీకొని తోడికోడళ్లు మృతి


సంఘటనా స్థలంలో రిబ్కా, చంద్రం మృతదేహాలు

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- రాజానగరం మండలం దివాన్‌చెరువులో ఘటన

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూలిపనికి వెళ్లి ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై వస్తుండగా టిప్పర్ ఢీకొన్న ఘటనలో తోటికోడళ్లు మృతి చెందిన ఘటన విషాదం నింపింది. జాతీయ రహదారిపై బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌పరిధిలోని దివాన్‌చెరువులో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన కప్పల రిబ్కా(50), కప్పల చంద్రం(49) ఇదే మండలంలోని పాలచర్ల రోడ్డులోని నర్సరీలో కూలి పనికి వెళ్లారు. పని ముగించుకుని నాగేశ్వరరావు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రాజానగరం వైపు వెళ్తున్నారు. వీరు దివాన్‌చెరువులోని పండ్ల మార్కెట్ వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి వస్తున్న టిప్పర్ ఢీకొని వీరిపైనుంచి వెళ్లిపోవడంతో రిబకా, చంద్రం అక్కడికక్కడే మృతి చెందారు. నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బొమ్మూరు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రైళ్ల రాకపోకల సమాచారం ఏదీ



సామర్లకోటలో పాత రైళ్ల రాకపోకలు టైం టేబులు

సామర్లకోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో అత్యధిక ఆదాయం రైలు ప్రయాణికుల ద్వారా సామర్లకోట జంక్షన్ రైల్వేస్టేషన్‌లో లభిస్తున్నా ఆ రీతిలో ప్రయాణికులకు రైళ్ల రాకపోకల సమాచారం సైతం స్పష్టంగా ప్రకటించడంలేదు. సామర్లకోట స్టేషన్‌కు నిత్యం విజయవాడ, విశాఖల వైపు 66 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వాటి రాకపోకల సమాచారాన్ని తెలియపరిచే టైంటేబులులో గత రెండేళ్ల క్రితం (1.10.2023) నాటి సమయాలు నేటికీ మార్చకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బుకింగ్ కార్యాలయంలో ప్రయాణికులు ఆయా రైళ్ల రాకపోకలకు సంబంధించి సమాచారం అడిగితే చిరుబుర్రులాడుతుంటారు. ఇదే విషయమై ఇటీవల రైల్వే డీఆర్ఎం అధికారి నరేంద్ర ఆనందరావు పాటిల్ సామర్లకోట పర్యటనకు విచ్చేసినపుడు పలువురు ప్రయాణికులు టైంటేబులు దుస్థితిపై ఫిర్యాదు చేయగా మరుసటి రోజే మార్పులు చేయాలని సదరు డీఆర్ఎం సిబ్బందిని ఆదేశించారు. 15 రోజులు గడుస్తున్నా నేటికీ అదే టైంటేబులు ఉండడంపట్ల రైల్వే అధికారుల్లో మార్పులు వచ్చేదెన్నడోనని ఆందోళన చెందుతున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గండేపల్లి మండలం మల్లేపల్లిలో ఘటన

గండేపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనుగోలుకు తల్లిని అడిగితే డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన ఎడ్ల సామేలు(30) వివాహమై భార్యతో కలిసి వేరు కాపురం ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. ఈనెల 16న తల్లి దగ్గరకు వెళ్లి సెల్‌ఫోన్ కొనుక్కోవడానికి డబ్బులు అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో గడ్డి మందుతాగాడు. అతడిని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ కలెక్టరేట్‌లో దళిత మహిళ ఆత్మహత్యాయత్నం


కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీదేవి

- వైసీపీ నాయకులు తమ భూమి కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు
- వెంటనే బయటకు వచ్చి పురుగుల మందు తాగిన మహిళ
- జీజీహెచ్‌కు తరలించిన సిబ్బంది


కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో దళిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వైసీపీ నాయకులు తమ భూమిని తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేశారని ఆమె ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చి బయటకు వచ్చిన తర్వాత ఆమె పురుగుల మందు తాగింది. వెంటనే కలెక్టరేట్ సిబ్బంది ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతోంది. కాకినాడ పేర్రాజుపేటకు చెందిన మందపల్లి శ్రీదేవి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసింది. తన భూమిని వైసీపీ నాయకులు గుర్రాల అనిల్‌కుమార్, గుర్రాల నాగేంద్రప్రసాద్, నల్లమిల్లి వెంకటరామిరెడ్డి తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించారని ఆరోపించారు. దీంతో కలెక్టర్ స్పందించి ఆ వివరాలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు పంపించారు. దీనిపై విచారణ చేయాలని ఆదేశించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆమె తీవ్ర ఆవేదన చెందుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ మేరకు ఆమె కుటుంబసభ్యుడు మందపల్లి హరి అనే వ్యక్తి విలేకరులకు పలు విషయాలు వివరించాడు. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ నగరంలో వైఎస్ఆర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో తమ భూమిని కోల్పోయామన్నారు. ఆ భూమికి బదులుగా ప్రభుత్వం దగ్గర్లోని పేర్రాజుపేటలో తమ ముగ్గురు అన్నదమ్ములకు కలిపి 200 గజాలు పట్టా ఇచ్చిందన్నాడు. 2021 నుంచి వైసీపీ నాయకులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆస్థలాన్ని కబ్జా చేయడానికి బెదిరిస్తున్నారని తెలిపాడు. దీనిలో కొంత మేర తమకు తెలియకుండా విక్రయించారని ఆరోపించాడు. సర్వేనెంబరు 91/1, టీఎస్ నెంబర్ 150/1లో తమ పట్టాభూమి ఇచ్చారని తెలిపాడు. వైసీపీ నాయకులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడమే కాకుండా కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్లు తెచ్చారన్నాడు. ఈ నేపథ్యంలో టూటౌన్ పోలీసుల ద్వారా తమను ఇళ్లు ఖాళీ చేయించేందుకు బెదిరిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో వారివల్లే తన భర్త మందపల్లి రాజు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని శ్రీదేవి ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో ఆమె పేర్కొన్నారు. తమను అధికారులే రక్షించాలని కోరారు. దీనిపై కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ ఈ వివాదంపై తమకు ఫిర్యాదు రాగా విచారణ చేస్తున్నామన్నారు. వివాదాలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో రెండు వర్గాలను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు

- అదే రోజు భారీ బహిరంగసభ
- గతంలో మూడురోజులు నిర్వహించాలని ప్రతిపాదన
- తాజాగా ఒకరోజుకే పరిమితం

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు మార్చి 14న పిఠాపురంలో నిర్వహించనున్నారు. గతంలో మూడురోజులపాటు ప్లీనరీసమావేశాలు నిర్వహించాలని భావించినప్పటికీ తాజాగా దాన్ని మార్పు చేస్తూ ఒకరోజుకే పరిమితం చేశారు. అదే రోజు పిఠాపురంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. జనసేన పార్టీ ఆవిర్భవించి దశాబ్దకాలం పూర్తయిన సందర్భంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని గతంలో భావించారు. ఇందుకుగాను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మూడురోజులపాటు ప్లీనరీ సమావేశాలు నిర్వహించి చివరిరోజున బహిరంగ సభ ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భావించారు. ఇందుకోసం ఆ పార్టీ నాయకులు అనువైన ప్రాంతాలకోసం పరిశీలన జరిపారు. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డుతోపాటు 216వ జాతీయ రహదారి వెంబడి పలు పంట పొలాలు, లేఅవుట్ స్థలాలు అప్పట్లో పరిశీలించారు. చిత్రాడ శివారులోని ఒక భారీ వెంచర్ ఆవరణ ఇందుకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. మార్చి 12, 13, 14వ తేదీల్లో ప్లీనరీ ఉంటుందని అప్పట్లో ప్రకటించారు. తాజాగా నిర్ణయంలో మార్పు జరిగింది. జనసేన ఆవిర్భావ వేడుకలను 14న పిఠాపురంలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభలో ఎన్నికల్లో నూరుశాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించిన తర్వాత నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో భారీగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి పవన్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

పిఠాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం


పిచ్చికుక్క విచక్షణారహితంగా కరవడంతో గాయపడిన విద్యార్థి, చిన్నారి

20మందికి గాయాలు

పిఠాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో 20మందికి గాయాలయ్యాయి. పిఠాపురం పట్టణంలోని మంగాయమ్మరావుపేట, చిట్టోడితోట పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పిచ్చికుక్క రోడ్డుపై వెళ్తున్నవారిపై దాడి చేసి గాయపరిచింది. పట్టణంలోని ఏకేపీఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, రోడ్డుపై ఆడుకుంటున్న మూడు సంవత్సరాల లోపు చిన్నారులతో సహా 20మందిని విచక్షణారహితంగా కరవడంతో గాయాలయ్యాయి. ఒక మహిళ తొడపై కరవడంతో తీవ్ర గాయమైంది. దీనితో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సాయంత్రం స్థానికులు కుక్కను హతమార్చారు. కుక్కకాటుతో గాయపడిన వారు పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి రాగా వైద్యులు చికిత్స అందించారు. ఇందులో ఇద్దరు చిన్నారులకు ముఖం, చాతిపై గాయాలవ్వడంతో వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు.

యువకుడి కిడ్నాప్ కేసులో ఐదుగురు వ్యక్తుల అరెస్టు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన యువకుడిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన సంఘటనలో ఐదుగురు వ్యక్తులను సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని దేవీనగరం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి గంగాధర్‌ను కిడ్నాప్ చేసి పిఠాపురం పట్టణంలోని రథాలపేట శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి బీరుబాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడంతోపాటు సిగరెట్లతో కాల్చి చిత్రహింసలకు గురిచేసిన సంగతి తెలిసిందే. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం గొల్లప్రోలు పట్టణానికి చెందిన బండి గణేష్, వి.శివాజీ పిఠాపురం పట్టణం రథాలపేటకు చెందిన గుర్రాల రాంబాబు, లచ్చబాబు, శీకోటి ఆకాష్‌లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ అసోసియేషన్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు

- జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో నమోదైన క్రీడాకారులు, శిక్షకులు, అంపైర్లు, స్కోరర్లు అసోసియేషన్ అనుమతి లేకుండా ప్రైవేటు టోర్నమెంట్లలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొంతమంది అసోసియేషన్ అనుమతి లేకుండా ప్రైవేట్ టోర్నమెంట్లలో పాల్గొన్నట్లు తమకు తెలిసిందని, ఇక మీదట ఎవరైనా అలా చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎవరైనా వ్యక్తిగతంగా అసోసియేషన్‌కి లిఖితపూర్వక దరఖాస్తు చేసుకుని అనుమతి వచ్చిన తర్వాతే టోర్నమెంటల్లో పాల్గొనాలన్నారు.

జీజీహెచ్‌లో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

- రోగిని శస్త్రచికిత్సకు సిద్ధం చేసేందుకు లంచం డిమాండ్ చేసిన సిబ్బంది
- విచారణ అనంతరం చర్యలు తీసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

జీజీహెచ్(కాకినాడ), జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. జీజీహెచ్‌లోని ఫ్యామిలీ ప్లానింగ్ ఓటీలో కొద్దిరోజుల క్రితం ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం ఓ మహిళ చేరింది. ఆమెకు ఈ నెల 15వతేదీన శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ వ్యవహారంలో ఆ ఓటీలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వ్యవహరించిన తీరు ఆందోళన కలిగించింది. ఆమెను శస్త్రచికిత్సకు సిద్ధం చేసేందుకు ముగ్గురు సిబ్బంది లంచం డిమాండ్ చేశారు. డబ్బులు తర్వాత ఇస్తామనడంతో శస్త్రచికిత్సను తాత్సారం చేశారు. రూ.300 లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత ఇస్తామని బాధితురాలి కుటుంబీకులు చెప్పినా వినలేదు. శస్త్రచికిత్సకు ఆటంకం కలిగించి డబ్బులు ఇచ్చిన తరువాత మాత్రమే ఆమెను సిద్ధం చేశారు. ఈ చేదు అనుభవాన్ని శస్త్రచికిత్స అనంతరం బాధితురాలి కుటుంబసభ్యులు ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకోగా మధ్యాహ్నం వారు ఫిర్యాదు చేశారు. అదేరోజు సాయంత్రం ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ తమ బృందంతో విచారణ చేశారు. విచారణలో ఆరోపణలు వాస్తవాలుగా నిర్ధారణ అయ్యాయి. అదనంగా అక్కడ ఉన్న మరికొద్ది మంది రోగులను విచారించగా అక్కడ ఉన్న సిబ్బందితో పడుతున్న వ్యధను వారు కూడా అధికారులకు విన్నవించారు. అందుకు వీడియోఆధారాలను కూడా విచారణాధికారులకు అందించారు. ఆ నివేదికను ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి అందించారు. ఈ నేపథ్యంలో సోమవారం రెగ్యులర్ ఎఫ్ఎన్ఓ వీరలక్ష్మి, కాంట్రాక్ట్ బేసిక్ ఎంఎన్‌వో రవితేజ, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు మంగలపై సస్పెన్షన్ వేటు వేస్తూ సోమవారం సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన కూచి వెంకటవిజయానందభగీరదశర్మ దంపతులు సోమవారం రూ.25వేలు విరాళం అందించారు. అర్చకుడు పేటేటి శ్యాములకుమార్ ఆధ్వర్యంలో దాత దంపతులకు దర్శనం కల్పించి, స్వామిచిత్రపటం, ప్రసాదం అందించారు.

ఎంఎస్ఎంఈ సర్వేను పూర్తిచేయాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ సర్వేను సచివాలయ ఉద్యోగులు త్వరితగతిన పూర్తిచేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మురళీ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవరరావు ఆధ్వర్యంలో సోమవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.

కూటమి అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేయండి

పి.గన్నవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తు రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ దువారపు రామారావు పిలుపునిచ్చారు. పి.గన్నవరం సాయితేజ స్కూలు, గ్రేస్‌డిగ్రీ కళాశాల, పి.గన్నవరం, పోతవరం గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు షేక్ సుభాన్, దాసరి వీరవెంకటసత్యనారయణ, బొల్లంగి నత్తిబాబు, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, అంబటి భూలక్ష్మి, శేరు శ్రీనుబాబు, ఆరుమిల్లి సాయిబాబు, నక్కా సత్యనారాయణ, గుత్తుల రామకృష్ణ, నేలపూడి దామోదరం, పేరిచర్ల నాగరాజు, యడ్ల ఏసు, పులపర్తి సుజాత పాల్గొన్నారు.



పి.గన్నవరం: పోతవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అల్లవరంలో ప్రచారం

అల్లవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం కోరుతూ సోమవారం మండలంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారం చేశారు. అల్లవరంలో రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ పట్టభద్రులను కూటమి నాయకులు కలిసి ఓట్లు అభ్యర్థించారు. జనసేన మండల అధ్యక్షుడ కంకిపాటి గోపి, బీజేపీ నాయకుడు నుంకర సాయిబాబు, టీడీపీ నేత మామిడిశెట్టి శ్రీరామ్, మెరికెల నాగేశ్వరరావునార్లన శ్రీనివాసరావు, రాసూరి రాంబాబు, నిచ్చెనకోళ్ల వెంకటరత్నం, బలభద్ర రవి, యెట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు చోట్ల ప్రచారం

మేనిఫెస్టో బ్రోచర్లు ఆవిష్కరణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చిల్లి ఆశోక్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో దొమ్మేటి రమణకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అశోక్ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల మేనిఫేస్టో బోచర్లు ఆవిష్కరించారు. పార్టీలోని నాయకులు కార్యకర్తలు రాజశేఖర్ విజయానికి కృషి చేయాలన్నారు. గొల్లపల్లి గోపి, నడింపల్లి శ్రీనివాసరాజు, యాళ్ల ఉదయ్, నిమ్మకాయల విస్సు, కాశీ రామచంద్రరావు, బురుగు కళ్యాణ్, తొత్తరమూడి జ్యోతిబాబు, కాశీ లాజర్, యలమంచిన రాజా, నీతిపూడి వంశీ, కెనానాజీ, గోదాటి గణేష్, ఎస్ఎంఎస్.ప్రసాద్, గొప్పిశెట్టి శ్రీనుపాల్గొన్నారు.

వీధికుక్కల సంతానోత్పత్తి తగ్గించేందుకు ప్రణాళిక

- అమలాపురం, ముమ్మిడివరంలలో 2వేలకు పైగా వీధి కుక్కలు
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ఏర్పాట్లు

అమలాపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైపోయింది. కుక్కలు బాబోయ్.. కుక్కలు అనే పరిస్థితి ఏర్పడింది. పురపాలక సంఘ సమావేశాలు ఎప్పుడు జరిగినా పలువురు కౌన్సిలర్లు వీధి కుక్కల బెడదతో పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెడుతున్నారు. ఇటీవల అమలాపురం 3వ వార్డులో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా నిర్వహించిన చర్చావేదికలో సైతం ఆ ప్రాంత ప్రజలు వీధికుక్కలతో భయంభయంగా రోజులు గడుపుతున్నట్టు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో వీధికుక్కల సంతానోత్పత్తిని తగ్గించేందుకు అమలాపురం పురపాలక సంఘంతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీలు నడుం బిగించాయి. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు ఓ కాంట్రాక్టు సంస్థలో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నట్టు అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. ఈనెలాఖరునాటికి అమలాపురం పట్టణంతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీలోని ఆడ, మగ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేందుకు సంబంధిత ఏజెన్సీ సిద్ధంగా ఉందన్నారు. కుక్కల నియంత్రణలో భాగంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా అమలాపురం మున్సిపల్ మార్కెట్ ఏరియాలో ఉన్న హిందూ శ్మశానవాటిక సమీపంలో రూ.5లక్షలతో ప్రత్యేకంగా మూడు గదులతో షెడ్డును నిర్మించారు. అంతేకాకుండా ఆపరేషన్ల నిర్వహణకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌తో పాటు ఇతర పరికరాల కొనుగోలుకు రూ.5లక్షలతో కౌన్సిల్ పాలనా అనుమతులు సైతం తీసుకున్నారు.



అమలాపురంలో వీధి కుక్కలు

2వేలకు పైగా వీధి కుక్కలు..

అమలాపురం మున్సిపల్, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో 2వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నట్టు అంచనా వేశారు. ఒక్క అమలాపురం పట్టణంలోనే 30వార్డుల్లో 1200కు పైగా వీధి కుక్కలు ఉన్నట్టు గుర్తించామని అమలాపురం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల ఏర్పాటులో భాగంగా శుక్రవారం అమలాపురం మున్సిపల్ కమిషర్ రాజు, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కర్నీడి మూర్తి, సహాయ సంచాలకుడు డాక్టర్ విజయారెడ్డిలు సమావేశం నిర్వహించారు. యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ల నిమిత్తం కొనుగోలు చేయాల్సిన వివిధ వనిముట్లపై చర్చించారు. ప్రత్యేకంగా నిర్మించిన షెడ్డులోనే సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తారు. అక్కడే కుక్కలను మూడు రోజుల పాటు ఉంచుకుని ఆ తరువాత రేబిస్ వ్యాక్సిన్ వేసిన తరువాత తిరిగి వాటిని ఆయా స్థానాలకు తీసుకువెళ్లే ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడతలో 250 వీధి కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీకి చెందిన వీధి కుక్కలను కూడా అమలాపురం తీసుకువచ్చి ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. త్వరలోనే వీధి కుక్కలన్నింటికీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి సంతానోత్పత్తిని తగ్గిస్తామని అధికారులు తెలిపారు.



అమలాపురంలో వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం నిర్మించిన ప్రత్యేక షెడ్డు

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీల ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సోమవారం ముమ్మిడివరంలోని సీడీపీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్నా వారి సమస్యలు మాత్రం పరిష్కరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్పుచేస్తూ జీవో విడుదల చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్‌కు సంబంధించి నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు కూడా వర్తింప చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని, సర్వీసులో ఉండి చనిపోతే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టెండరు అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే చెల్లించాలని, మెను చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్‌ను సరఫరా చేయాలని వారు కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీవో ఐ.విమలకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు ఎస్.దుర్గామహేశ్వరి, కార్యదర్శి ఎం.జయలక్ష్మి, గాలి మంగమ్మ, జి.అనంతలక్ష్మిశ్రీదేవి, సుబ్బలక్ష్మి, కె.కనకదుర్గ, అరుణకుమారి పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పలతో తయారుచేసే వస్తువులపై శిక్షణ



కొబ్బరి చిప్పలతో కళాకృతులు తయారు చేయడాన్ని వివరిస్తున్న హరికృష్ణ

మామిడికుదురు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కొబ్బరి చిప్పలతో వివిధ రకాల వస్తువులు తయారుచేయడంపై శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం పాశర్లపూడిలో ప్రారంభించారు. ఆక్సిజన్ అసోసియేషన్, కోకోమంత్ర ఆధ్వర్యంలో 30మంది మహిళలకు 3రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. కోకో మంత్ర ప్రతినిధి ఎ.హరికృష్ణ మాట్లాడుతూ కొబ్బరి చిప్పలతో 100రకాల వివిధ రకాల కళాకృతులను తయారు చేయవచ్చునని తెలిపారు. ఆయా కళాకృతులను తయారు చేయడంపై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కొబ్బరితో తయారుచేసిన వస్తువులకు ప్రపంచ దేశాల్లో మంచి గిరాకీ ఉందని, వాటి తయారీ ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికరెడ్డి గంగాధరం మహిళలు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం

మామిడికుదురు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. సోమవారం మగతపల్లి, గోగన్నమఠం గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. డెల్టా నీటి సంఘం చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, బొలిశెట్టి జయరాం, డొడ్డా జయరాం, చాగంటి స్వామి, కడలి కృష్ణమోహన్, గోగి గోపి పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు కేంద్ర బృందం



పి.గన్నవరం సీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సీహెచ్‌సీని జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు(ఎన్‌క్యూఏఎస్)లో భాగంగా కేంద్రం ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇద్దరు వైద్యులతో కూడిన బృందం సోమవారం పరిశీలించింది. రెండు రోజులు జరిగే పరిశీలనలో వైద్య బృందం కర్నాటక రాష్ట్రానికి చెందిన డాక్టర్ మర్యాన్ వి.వాషింగ్టన్, కేరళ రాష్ట్రానికి చెందిన ఎలిజబెత్ మెయిలీ వరగీసేలు ఆసుపత్రిలో ప్రజారోగ్య సౌకర్యాలు, వైద్యులు అందించే వైద్యం వంటి సదుపాయాలు ఏవిధంగా అందుతున్నాయో నిర్ధారిస్తారు. ముఖ్యంగా పేషెంట్ కేర్, పేషెంట్ ఫీడ్‌బ్యాక్, క్లినికల్ సర్వీసెస్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను బృందం అంచనా వేసి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్(ఎన్‌క్యూఏఎస్)కు పంపనుంది. ఈపరిశీలనలో సాధించిన స్కోరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించనుంది. 2019లో కూడా ఎన్‌క్యూఏఎస్ పరిశీలనలో సీహెచ్‌సీ మంచి స్కోరును సాధించి కేంద్రం అందించే నిధులకు అర్హత సాధించింది. తొలుత కేంద్ర వైద్య బృందానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావువైద్యులు స్వాగతం పలికారు. మొదటిరోజు ఓపీ విభాగం, ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులు, అత్యవసర విభాగం, ఎక్స్‌రే విభాగం, లేబర్‌రూమ్, మరుగుదొడ్లు, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించి పలు అంశాలపై వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. పరిశీలనలో బయో మెడికల్ ఇంజనీర్ ఈ.నరేంద్ర, జిల్లా క్వాలిటీ కాన్సల్టెంట్ కె.సునీత ఉన్నారు.

అదిగో రామేశ్వరం...ఆలయ నిర్మాణం పునాదులకే పరిమితం

- దేవదాయ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం
- 32ఎకరాలున్నా ఆదరణ కరువు

అల్లవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): త్రేతాయుగంలో సీతాదేవి అన్వేషణ సమయంలో సాక్షాత్తు శ్రీరామునిచే శివలింగ ప్రతిష్ఠ జరిగిన పవిత్ర పార్వతీరామేశ్వరస్వామి ఆలయం అది. కౌశిక మహాముని తపస్సు చేసిన పుణ్యస్థలమది. కౌశిక నదీపాయ తీరాన సముద్ర తీరంలో రామేశ్వరస్వామి ఆలయం నిర్మించిన ప్రాంతాన్ని రామేశ్వరంగా పిలుస్తున్నారు. కొమరగిరిపట్నం శివారు సామంతకుర్రు పరిధిలో ఈపవిత్ర ఆలయం ఉంది. మహాశివరాత్రి, చొల్లంగి అమావాస్య రోజుల్లో వేలాదిగా భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి పార్వతీ రామేశ్వరున్ని దర్శించుకుంటున్నారు. ఎస్.రామేశ్వరంలోని పార్వతీ రామేశ్వరం ఆలయ ప్రాంగణంలోకి, ఆలయంలోకి వర్షాకాలంలో కౌశిక నదీపాయ ఉప్పునీరు ఎగదన్నడంతో ఈపురాతన ఆలయాన్ని తొలగించి కొత్త ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు. భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు కొత్త ఆలయ నిర్మాణం చేపట్టారు.



పునాదుల్లో నిలిచిన ఎస్.రామేశ్వరం శివాలయం

రామేశ్వరం ఆలయ నిర్మాణంలో జాప్యం దేవదాయ శాఖపై ఆగ్రహం

పురాణ ప్రసిద్ధి పొందిన పవిత్ర పార్వతీ రామేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ ద్వారా రూ.1.60కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈఆలయాన్ని పూర్తిగా తొలగించి పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గడిచిన తొమ్మిది నెలలుగా రామేశ్వర ఆలయ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కామన్ గుడ్‌విల్ ఫండ్ ద్వారా ముందస్తుగా రూ.50లక్షలు నిధులు మంజూరు చేశారు. పునాదులు వేసి వదిలేశారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది నెలలు దాటినా ఆలయ నిర్మాణం నత్తనడకగా సాగుతోంది.

రూ.52లక్షలు అల్లూరి విరాళం..

పార్వతీ రామేశ్వరం ఆలయం రాతితో నిర్మిస్తే రూ.52లక్షలు నిధులు ఇస్తామని సామంతకుర్రుకు చెందిన దాత అల్లూరి వెంకటలక్ష్మీనరసింహరాజు ప్రకటించారు. దేవదాయ శాఖకు విరాళాన్ని ప్రకటిస్తూ లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. దాతలు ముందుకు వస్తున్నా దేవదాయ శాఖ అధికారులు ఆలయ నిర్మాణంలో చొరవ చూపడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

32ఎకరాలు భూములున్నా ఆదరణ కరువు

పార్వతీ రామేశ్వర ఆలయానికి దాతలు ఇచ్చిన 32ఎకరాల భూములు ఉన్నాయి. సామంతకుర్రు గ్రామంలో 29ఎకరాలు, చల్లపల్లిలో 3ఎకరాల భూములు ఉన్నాయి. భూమి శిస్తులు బకాయిలు కూడా నీడలా వెంటాడుతున్నాయి. ఈఆలయానికి ఆస్తులు ఉన్నప్పటికీ ఆదరణ కరువైంది. భక్తులు వేసిన దక్షిణతో హుండీ ద్వారా ఏటా రూ.2లక్షల ఆదాయం వస్తుంది.

కొబ్బరిపై డాక్యుమెంటరీ

మామిడికుదురు, ఫిబ్రవరి 17(ఆంధ్ర జ్యోతి): కోనసీమ కొబ్బరిని అందరికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో డాక్యుమెంటరీ తీస్తున్నట్టు వేహరి ఆగ్రో ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ వేహరి వెంకట వికాశ్ తెలిపారు. సోమవారం డాక్యుమెంటరీ షూటింగ్ పాశర్లపూడిలంకలో ప్రారంభించారు. కార్యక్రమంలో పాశర్లపూడిలంకకు చెందిన పెద్దమళ్ల నాగబాబు కొబ్బరి పంట వల్ల కలిగే ఉప యోగాలను వివరించారు. వెంకట వికాశ్ మాట్లాడుతూ కొబ్బరి ద్వారా 30రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చునని, తమ కంపెనీ ద్వారా అమెరికా, కెనడా, ఇంగ్లాండ్ ఆస్ట్రేలియా తదితర దేశాలకు కొబ్బరి ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. కొబ్బరి గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు డాక్యుమెంటరీ చిత్రీకరిస్తున్నట్లు ఆయన చెప్పారు.



గణపతి ఆలయ వార్షికోత్సవం

మామిడికుదురు, ఫిబ్రవరి17(ఆంధ్ర జ్యోతి): వాసంశెట్టి సత్యనారాయణమూర్తి కుమారుడు వెంకట రమాకాంత్ బాబు, కవితలు మామిడికుదురు హైస్కూల్ రోడ్డులో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణ, గణపతి పూజ తదితర పూజలు జరిపారు. అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో నిర్మాణాలు ఆపాలని ధర్నా



తహశీల్దారు కార్యాలయం ఎదుట ఈదరాడ గ్రామస్థుల ధర్నా

మామిడికుదురు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఈదరాడ గ్రామంలోని శ్మశాన వాటికలో నిర్మిస్తున్న ఆర్‌సీసీ బెడ్ ప్లాట్‌ఫాం, షెడ్ నిర్మాణాలు ఆపాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గ్రామంలోని కలింగులపేట, జాబ్‌వారి తోట, నడిమిలంక, చాకిరేవు చెరువుగట్టు, అల్‌క్యాస్ట్ కొత్త, పాత కాలనీలు, ఈదరాడ మెయిన్ ఏరియా ప్రాంతాలకు చెందిన శ్మశానవాటికలో ఈనెల 15వ తేదీన దౌర్జన్యంగా బెడ్ ప్లాట్‌ఫాం షెడ్ నిర్మించడానికి ప్రయత్నించగా తాము అడ్డుకున్నామని పేర్కొన్నారు. ఆయా నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దారు కె.శరణ్యకు అందజేశారు. స్థానిక పురుషులు, మహిళలు పాల్గొన్నారు.

లీగల్ సెల్ ఆధ్వర్యంలో సర్వే

ముమ్మిడివరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్వర్యంలో సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు బృందంగా ఏర్పడి ముమ్మిడివరం మండలంలోని కొమనాపల్లి, ఐ.పోలవరం మండలం మురమళ్ల, కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామాల్లో 18ఏళ్లలోపు ఉన్న అంగవైకల్యం కలిగిన చిన్నారులను గుర్తించి వారికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. సదరం సర్టిఫికెట్లు లేని వారికి వారిని సదరన్ క్యాంపునకు సిఫార్సు చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరాసీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



అల్లవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) ఓడలరేవులో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అశేష భక్తజనం మధ్య సోమవారం శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీసీతా రాముల పంచ లోహ విగ్రహాల ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ ముదునూరి సత్య నారాయణరాజు దంపతులు, ధర్మకర్తలు ముదునూరి రంగరాజు కుటుం బసభ్యులు, విగ్రహాల దాతల కొప్పాడి వెంకటరామ కృష్ణారావు దంపతులు కర్తలుగా పాల్గొని విగ్రహ ప్రతిష్ఠ హోమ కార్యక్రమాలు జరిపించారు. బ్రహ్మశ్రీ సుదర్శనం వెంకటజనార్ధనాచార్యులు బ్రహ్మత్వాన పూర్ణాహుతి, గణపతిహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించిన స్వాములను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. హరినామ, రామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది

సహజ కవి వెంకట్‌కు కళాకిరీటి ప్రతిభా పురస్కారం

అంబాజీపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మలికిపురం గాంధీనగర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబాజీపేటకు చెందిన సహజ కవి పాలమూరి వెంకట్‌కు కళా కిరీటి ప్రతిభా పురస్కారం లభించింది. కవితాగానం చేసినందుకు వెంకట్‌కు కళాకారుల సమక్షంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సత్కరించారు. కార్యక్రమంలో కొల్లి రమావతి, జి.ఈశ్వరి, టి.పార్థసారధి, చొప్పల రామారావు, కడలి కృష్ణారావు, అల్లూరి జానకి, రామరాజు పాల్గొన్నారు.

వ్యవసాయంలో నాణ్యమైన దిగుబడులు సాధించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జీవనియంత్రణ పద్ధతుల ద్వారా వ్యవసాయంలో మెలకువలు పాటించి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు సూచించారు. స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాల బీఎస్సీ మొదటి సంవత్సర విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు, పురుగులు, తెగుళ్ల గురించి, వాటి నివారణ చర్యలు, కొబ్బరిలో రకాలు, అంతర పంటలపై వివరించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న జీవనియంత్రణ పద్ధతులు, కోకో పంట తెగుళ్లు, యజమాన్య పద్ధతులను చలపతిరావు వివరించారు. పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, డాక్టర్ మమత, బి.నీరజ, డాక్టర్ వి.అనూష తదితరులు పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. గ్రేస్ కళాశాల బోటని అధ్యాపకురాలు జి.పూజ, సహాయ సిబ్బంది నూడా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ ప్రజ్ఞా సాహితి 5వ వార్షికోత్సవం సోమవారం పశువుల్లంకలో జరిగింది. ఇందులో భాగంగా వివిధ రంగాలకు చెందిన వారికి అవార్డులు, ఆత్మీయసత్కారాలు, బహుమతులు అందించారు. జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ, ఎస్.ఎన్.మునేశ్వరరావు, రాయపురెడ్డి బాబీకి అవార్డులు ప్రదానం చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు సావిత్రీబాయిఫూలే విద్యాకాంతి అవార్డులు ప్రదానం చేశారు. ఇటీవల క్రీడల్లో, డిబేట్లలో విజేతలకు బహుమతులిచ్చారు. కార్యక్రమంలో పుల్లెపు వెంకటేశ్వరరావు, హెచ్ఎం మూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, రేవు అప్పలస్వామి, ఉంగరాల వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాద్, ఎన్.సత్యనారాయణ, మెల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ స్వాధీనం

పి.గన్నవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం లంక ప్రాంతంలో అనధికారికంగా తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తహశీల్దారు పి.శ్రీపల్లవి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. సంబంధిత వాహన యజమానులకు జరిమానా విధిస్తామని తహశీల్దారు తెలిపారు. ఆర్ఐ వర్మ, వీఆర్వోలు పి.నరసింహారావు, కోరుకొండ శ్రీను పాల్గొన్నారు.

'వరి నాట్లు వేయకండి'

కాట్రేనికోన, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు ఉప్పుచెరువు రైతులు, కాట్రేనికోన శివారు రైతులు ప్రస్తుతం దాళ్వా నాట్లకు సిద్ధపడుతున్నట్టు వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ అన్నారు. నాట్ల సమయం దాటిపోయినందున నాట్లు ఆపాలని సూచించారు. నాట్లు వేస్తే పూత దశ వరకు మాత్రమే సాగు నీరు అందే అవకాశముందన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాట్రేనికోన, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దొంతికుర్రు నీటి సంఘం చైర్మన్ పిన్నమరాజు రంగరాజు తండ్రి సత్యనారాయణరాజు మరణించారు. అలాగే కలిదిండి వెంకటసుబ్బరాజు, కాట్రేనికోన తామరచెరువుకు చెందిన టీడీపీ కార్యకర్త చెల్లూరి వెంకటరమణ, చిలకాయచెరువుకు చెందిన నీరుపూడి సత్యనారాయణ మరణించారు. ఆయా కుటుంబాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో దాట్ల పవన్, మెంట్రు సుధీర్, పీఎస్ఎన్ రాజు, దంతులూరి రామకృష్ణంరాజు, వాసంశెట్టి రాజేశ్వరరావు, సత్తిల ప్రసాద్, గోడి వెంకట్రావు, సంసాని గంగాధర్, పేటీ వర్మ, బీర అంబేడ్కర్, కాశి జ్యోతిబాబు, మోకా అప్పారావు, కముజు లక్ష్మణ్, పరమట వెంకటేష్, చెల్లూరి సుభాష్, కాజా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మురమళ్లలో ట్రాఫిక్ కష్టాలు

పట్టించుకోని పోలీసులు



ఐ.పోలవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఐలెండ్ ప్రాంతానికి ప్రధాన వ్యాపార కేంద్రమైన మురమళ్లలో ట్రాఫిక్ ఎంత ఘోరంగా ఉందంటే ప్రయాణీకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అడుగులు కదిపేలా ఉంది. 216 జాతీయ రహదారిపై మురమళ్ళ వద్ద తరచూ ట్రాఫిక్ ఇక్కట్లతో వాహనదారులు యమయాతన పడుతున్నారు. ఉదయం, సాయంత్రం ఇక్కడ ట్రాఫిక్ పద్మవ్యూహంలా ఉంటోంది. బయట పడేందుకు గంటల కొద్దీ వాహనదారులు ప్రయత్నిస్తే గాని మోక్షం లభించడం లేదు. ప్రతిరోజుఉదయం 8నుంచి 9గంటల వరకు మాణిక్యాంబ అమ్మవారి ఆలయం నుంచి మార్కెట్ వరకు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభిస్తోంది. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిఇలాఉంటే ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం హైదరాబాదు నుంచి వచ్చిపోయే ప్రైవేటు బస్సులు ఒకేసారి రావడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. సాయంత్రం యానాం నుంచి హైదరాబాదు వెళ్లే బస్సులు ఒకేసారి వచ్చి ఇక్కడ ట్రాఫిక్‌ను క్లిష్టంగా మార్చి ప్రయాణీకుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. దీనికి తోడు మాణిక్యాంబ అమ్మవారి ఆలయం వద్ద రహదారికి ఇరువైపులా ఆటోలు పార్కు చేయడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది.

పోలీసులు పట్టించుకోకపోవడమే సమస్యకు కారణం

రోజూ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభిస్తున్నా పోలీసులు మాత్రం తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. మురమళ్లలో ఎంతో ప్రసిద్ధి చెందిన వీరేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. సాయంత్రం ప్రతిరోజూ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో సాయంత్రం ట్రాఫిక్ సమస్య మరింతగా తీవ్రమవుతోంది. ప్రతిరోజూ పోలీసులు ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. హైదరాబాదు నుంచి వచ్చే బస్సులు ఒకేసారి కాకుండా కొంచెంవ్యవధిలో వచ్చేలా పోలీసులు నియంత్రించాలి. ఎక్కువ ట్రాఫిక్ రద్దీ ఉండే మాణిక్యాంబ అమ్మవారి ఆలయం వద్ద నుంచి మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళేందుకు రహదారి ఉంది. ఇక్కడ పోలీసులు ట్రాఫిక్‌నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముగిసిన లంకలగన్నవరం సర్పంచ్ అంత్యక్రియలు

సర్పంచ్ పాడె మోసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



సర్పంచ్ రామకృష్ణ పాడె మోస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం జనసేన సర్పంచ్ పసలపూడి రామకృష్ణ అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. అంతిమయాత్రలో భారీసంఖ్యలో గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు. తొలుత పి.గన్నవరం సెంటర్ నుంచి మొదలైన ఊరేగింపు లంకలగన్నవరం చేరుకుని ప్రధాన వీధుల్లో సర్పంచ్ పార్థివదేహాన్ని అభిమానులు, గ్రామస్తులు బాణసంచా కాల్పులతో ఊరేగించారు. సర్పంచ్ మృతదేహంపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ జనసేన పార్టీ జెండాను కప్పి పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ పాడెను ఎమ్మెల్యే మోసారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్, మండలపరిషత్ ఉద్యోగులు పూలమాలలతో నివాళులర్పించారు. లంకలగన్నవరం గోదావరి నదీ తీరంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు ఉన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి ఉత్సవం

అంబాజీపేట, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం శివారు అరిగెలవారిపాలెంలో వేంచేసియున్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. కౌశికా నదీ తీరానికి వీరభద్రస్వామిని తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని పలువురు నాయకులు, భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి జరిగిన ఉత్సవంలో తీన్‌మార్, శక్తివేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.2.68 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,68,190 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


చింతలూరు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆలమూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరు ఉత్తర ముఖద్వారంలోనున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతం, తోమాల సేవ తదితర కార్యక్రమాలు వేదమంత్రాలతో మొదలు పెట్టారు. అనంతరం పవిత్రోత్సవం, వేంకటేశ్వరస్వామి పతాకావిష్కరణ జరిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయగా, అంకుర్పణకు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో శ్రీకారం చుట్టారు. స్వామి, అమ్మవార్లను శేషవాహనంపై ఉంచి ఊరేగించారు. మహిళా భక్తులు కోలాటం చేసుకుంటూ సాగిన ఊరేగింపు ఆకట్టుకుంది. సాయంత్రం ప్రముఖులతో ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. తదుపరి అంకురార్పణ నవకుంభారోపణ జరిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ ప్రతినిధులు అల్లంరాజు భరణి, ద్విభాష్యం కాశీవిశ్వనాధశర్మ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజును పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వీరభద్రుడికి మంత్రి సుభాష్ పూజలు


వీరభద్రుడి సంబరంలో పాల్గొన్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ గ్రామంలో సోమవారం వీరభద్రుడి సంబరాన్ని నిర్వహించారు. గ్రామంలో కొన్నేళ్లుగా నిర్మన వీరభద్రరావు, సూర్యావతి దంపతులు గద్దెను నిర్వ హిస్తున్నారు. సోమవారం ఆయా గ్రామాల భక్తులు రాగా వైభవంగా సంబరాన్ని జరిపారు. కార్యక్రమంలో కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని వీరభద్రుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తోట వెంకన్న, సలాది రమేష్, వెర్రియ్య సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనమ్మతల్లి గ్రామోత్సవం

కె.గంగవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట గ్రామంలో నిర్మిస్తున్న ధనమ్మతల్లి ఆలయం వద్ద ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కోట, కోటిపల్లి, దంగేరు, గంగవరం పరిసర గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, పంపన సుబ్బారావు, నేమాని సత్యనారా యణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కోటలో ధనమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు


సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని తదితర డిమాండ్లతో సోమవారం రామచంద్రపురం సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా జరిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు యు.వరలక్ష్మి, మేడిశెట్టి దుర్గమ్మ మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ పీవో వరలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకుడు బలరామ్, జి.వెంకట రత్నం, చంద్రకళ, జి.శ్రీదేవి, కె.దుర్గ, ఐ.గోనలీ దేవి, సూర్యకళ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలంటూ ధర్నా


ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలంటూ కపిలేశ్వరపురం కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిపారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.బేబి, సీహెచ్ రాణి, తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం మండపేట కార్యాలయంలో సీడీపీవో ఎగజ లక్ష్మికి వినతిపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు పి.కుమారి, ఎం.జానకీదేవి, టి.మంగాదేవి, పి.అనంతలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'విలీన సభను విజయవంతం చేయాలి'

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 23న జరగనున్న సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ పార్టీల విలీనసభను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జె.సత్తిబాబు కోరారు. సోమవారం స్థానిక చెలికాని రామారావు స్మారక భవనంలో విజయవాడలో జరిగే విలీనసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఇప్పటికే రెండు డెమోక్రసీ పార్టీలు కేంద్రంలో చర్చలు జరిపి విలీనం జరిగిందన్నారు. ఏపీలో విలీన సభ ఈనెల 23న జరుగుతుందన్నారు. సభకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వై.సాంబశివరావు, సాదినేని వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధులు జేవీ చలపతిరావు తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎం.ఏసు, గుబ్బల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు

ప్రజలకు ఆర్డీవో శ్రీకర్ హితవు

కొత్తపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేనందున ప్రజలు ఆందోళన చెందవద్దని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పశుసంవర్ధకశాఖ అధికారులతో బర్డ్‌ఫ్లూపై ఆయన సమీక్షా సమావేశం జరిపారు. జిల్లాలో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ ఎక్కడా లేదని ఆయన తెలిపారు. ముందస్తు చర్యలలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేసి కోళ్ల ఫారాల్లో ఏమైనా కోళ్ల మరణాలు ఉన్నాయా లేవా అని రోజూ ఆరా తీస్తున్నామని పశుసంవర్ధకశాఖ అధికారులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. కోళ్ల పెంపకందారులు ఫారాల్లోకి ఇతరులను అనుమతించకుండా వాటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోళ్ల పెంపకందారులకు సూచించారు. వండిన కోడి మాంసం, ఉడికిన గుడ్డు తినడం వల్ల వ్యాధి రాదని వారు తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూని అవకాశంగా చేసుకుని గొర్రె, మేక, చేప తదితర మాంసాలను అధిక ధరలకు అమ్మిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ, కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు పశువైద్యాధికారులు ఎస్.ఉమామహేశ్వరరెడ్డి, అనిత, ఎల్.విజయారెడ్డి, కోళ్ల పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.


పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్




ఆత్రేయపురం మండలం అంకంపాలెం జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల ఓట్లను అభ్యర్థిస్తున్న గణేష్‌కుమార్. పక్క చిత్రంలో రామచంద్రపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా కూటమి నాయకుల ప్రచారం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు విద్యావంతులు సహకరించాలని నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు కోరారు. సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తరపున కూటమి నాయకులు రామచంద్రపురం మండలంలో చోడవరం, నరసాపురపపేట, యనమదల, ఓదూరు, మాలపాడు గ్రామాలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ ఎం.రాంబాబు, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకట రమణ, మాజీ కౌన్సిలర్లు దంగేటి గౌరీశంకర్, అల్లం శ్రీనివాస్, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీను, సి.వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం ఆలమూరు మండలంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పట్టభద్రుల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. మండలంలోని పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఇంటింటి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. పెదపళ్లలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు నామాల వెంకటేష్, ఆలమూరులో టీడీపీ నాయకుడు ఈదల రాంబాబు ఓట్లను అభ్యర్థించారు.

ఇంటింటికి వెళ్లి ఓట్ల అభ్యర్థన

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు పేర్కొన్నారు. అంకంపాలెంలో సోమవారం గ్రాడ్యుయేట్ల ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. హైస్కూల్, పాఠశాలలో కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పి.సత్యవతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు కె.కృష్ణమూర్తి, సర్పంచ్ ముత్రాబత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.


అధునికీకరించిన గదిని ప్రారంభిస్తున్న రామచంద్రపురం డీఎస్పీ

శాంతి భద్రతలకే తొలి ప్రాధాన్యం

రామచంద్రపురం డీఎస్పీ

మండపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యం అని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ అన్నారు. మండపేటలో ఆధునీకరించిన సీఐ గదితో పాటు, స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీసు హెల్ప్‌డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేశామని సీఐ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐతోపాటు, రూరల్ సీఐ పీతల దొర్రాజు, టౌన్ ఎస్ఐ, హరికోటిశాస్త్రి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన మౌలానా: మండపేటకు చెందిన వ్యాపారి డాక్టర్ అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మౌలానా సోమవారం డీఎస్పీ రఘువీర్‌ను స్టేషన్‌లో కలిశారు. వచ్చేనెలలో జరిగే రంజాన్‌కు సంబంధించి తమ ట్రస్టును సందర్శించాలని ఆయన కోరారు.


కొత్తపేట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈవో సలీంబాషా

పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలి

కొత్తపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని డీఈవో షేక్ సలీంబాషా పేర్కొన్నారు. సోమవారం జడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సబ్జెక్టు వారీగా సమీక్షించారు. అనంతరం క్లాసుల్లోకి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ఈయన వెంట ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

యువత సమస్యపై పోరాడే వ్యక్తి సుందర్

రావులపాలెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): యువత సమస్యలపై పోరాడే వ్యక్తి జీవీ సుందర్ అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రావులపాలెం కొత్తకాలనీలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికలలో తమ కుమారుడు పోటీ చేస్తున్నారన్నారు. రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట మండలాల పట్టభద్రులు, ఉద్యోగులు తమ కుమారుడికి ఓటు వేసి గెలిపించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో రమేష్, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు తరలిరండి'

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలన్న ప్రధాన డిమాండుతో 24న తాడేపల్లిలో ఉపాధి కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాకు వ్యవసాయ కూలీలు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు కోరారు. రామచంద్రపురంలో డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సభలో వక్తలు మాట్లాడుతూ ఉపాధి హామీలో 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. కోస్తా జిల్లాలు, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలో ఉపాధి లేక గ్రామాలు ఖాళీ అవుతున్నాయన్నారు. ఉపాధి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ, బీకేఎంయు కన్వీనర్ పి.రాము, వ్యవసాయ కార్మిక నాయకుడు బాబ్జీ, డి.రవి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐతో పాటు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూరులో సీతారామ, అభయాంజనేయస్వామి నూతన ఆలయ, శిలామయ విగ్రహ ప్రతిష్ఠను సోమవారం వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా పెదపూడి లక్ష్మీజనార్ధనమూర్తి, వారి కుమారుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో పెద్దింటి లక్ష్మణాచార్యులు బ్రహ్మత్వంలో ఈదల సతీష్, సత్యవేణి దంపతులతో భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, గుత్తుల వీరవెంకట సత్యనారాయణ, కామేశ్వరమ్మ దంపతులతో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా జరిపారు. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, రత్నన్యాసం, భక్తాంజనేయస్వామి శిలా విగ్రహం, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి శిలా విగ్రహం, సుధామయ ఆలయ శిఖర ప్రతిష్ఠ, శాంతి హోమం, పూర్ణాహుతి, తదితర పూజలను జరిపారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన ఇన్‌చార్జ్ లీలాకృష్ణ: నల్లూరులో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన ఇన్‌చార్జ్ లీలాకృష్ణ స్వామివార్లను దర్శించుకుని పూజలు జరిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అధికసంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల


ర్యాలీలో బీజేపీ నూతన కమిటీ బాధ్యతలు చేపడుతున్న దృశ్యం

సమర్థవంతంగా పనిచేయాలి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీజేపీ శ్రేణులదేనని మండల అధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ర్యాలీలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్ యిళ్ల సత్యనారాయణ పాల్గొని మండల కమిటీపై చర్చించి ప్రకటించారు. రాష్ట్ర నాయకుడు అయినవిల్లి సత్తిబాబు, కాలాబత్తుల చిన్నారి కేంద్ర పథకాలను తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా యు.వెంకటేశ్వరరావు, తాడాల పండు, వై.అప్పారావు, ఉపాధ్యక్షులుగా అనిల్‌కృష్ణవర్మ, రామచంద్రం, శివరామకృష్ణ, కార్యదర్శులుగా నిర్మలకుమారి, కొండలరావు, హరిబాబు, రవిశంకర్, పదాధికారులుగా సుబ్బారావు, రాంబాబు, సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మదర్‌థెరిస్సా సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు అకాడమి డైరెక్టర్ టి.వెంకటలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 16న బాపట్ల జిల్లాలో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ, టైక్వాండో పోటీలలో అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. బాలికల పటాస్ విభాగంలో వీరపల్లి దేదిప్య ప్రథమస్థానం, నాన్ చాక్ పటాస్ విభాగంలో సత్తి విజయరెడ్డి ప్రథమస్థానం, కర్రి లీలాశ్రీప్రణీత్‌రెడ్డి ద్వితీయ స్థానం, బి విభాగంలో తమలంపూడి తేజారెడ్డి ప్రథమస్థానం, సి విభాగంలో తలారి విష్ణురూప్ ప్రథమస్థానం, పండి వైవిక్ ద్వితీయస్థానం, ఏ విభాగంలో గెద్దాడ జోయ్‌కిరణ్ ద్వితీయ స్థానం, తలారి కీర్తినరెడ్డి ప్రథమస్థానం సాధించారని ఆమె తెలిపారు. విజేతలను సీఆర్సీ అధ్యక్షులు తాడి నాగమోహనరెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, టీడీపీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలుపూరి సతీష్‌రాజు, అకాడమి అధ్యక్షులు టి.అబ్బులు, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ లక్ష్మీనందీప్‌కిరణ్ తదితరులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఘనంగా షిర్డీసాయి వార్షికోత్సవం

రావులపాలెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఈతకోట రహదారి వద్దనున్న షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సాయిబాబాకు అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. విరాళాలు ఇచ్చిన దాతలను ఆలయ కమిటీ చైర్మన్ పత్సవాయి బాబిరాజు ఆధ్వర్యంలో సత్కరించారు.

డేటా ఎంట్రీ కోర్సు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుల శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్కిల్ హబ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరుణోదయ కుమార్ తెలిపారు. రామచంద్రపురం జూనియర్ కళాశాలలో ఉచితంగా అందించే శిక్షణకు పాసుపోర్టు సైజు ఫొటో, విద్యార్హత, ఆధార్ జిరాక్సులతో సంప్రదించాలని కోరారు. వివరాలకు 99484 04165 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

రాయవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు నేటి నుంచి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామచంద్రపురం ఇన్‌చార్జ్ డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రాథమిక అభ్యాసాన్ని మెరుగుపరిచేలా జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. మొదటి విడతగా నేటి నుంచి 20 వరకు, రెండోవ విడతగా ఈనెల 22, 24, 25 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ జరుగుతుందన్నారు.


మంత్రి నాదెండ్లను కలసిన నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

మంత్రి నాదెండ్లను కలసిన గారపాటి

ఆలమూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరా శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు, జనసేన నాయకుడు గారపాటి శ్రీనివాస్ కలిశారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఆత్మీయ కలయిక సందర్భంగా రాజమహేంద్రవరంలో కలసి సంభాషించారు. పార్టీ కోసం, అధినేత పవన్ ఆశయాల మేరకు ప్రతి ఒకరు కష్టపడి పని చేయాలని మంత్రి మనోహర్ సూచించారని ఆయన అన్నారు.


వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ రంగారావు

పారిశుధ్య నిర్వహణపై నిఘా

మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు చెప్పారు. పట్టణంలో సోమవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించి పట్టణ ప్రజలకు తడి-పొడి చెత్తపై అవగాహన కల్పించారు. వార్డుల్లో పారిశుధ్యం నిర్వహణ తీరుపై ఆయన వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు.


మాంసం దుకాణంలో నాణ్యత పరిశీలిస్తున్న వెటర్నరీ ఏడీ డాక్టర్ అనిత

మాంసం దుకాణాలపై వెటర్నరీ అధికారుల దాడులు

ఆలమూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో దాడులు జరిపారు. ఆలమూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత అధ్వర్యంలో పశుసంవర్ధక బృందం ఆలమూరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక, నర్సిపూడి, గుమ్మిలేరు, మోదుకూరు, పెదపళ్ల, సంధిపూడి, పినపళ్ల, చింతలూరు తదితర గ్రామాల్లో మాంసం దుకాణాలపై దాడులు చేశారు. ఏడీ అనిత మాట్లాడుతూ ఈ దాడుల్లో నిల్వ మాంసాలు లభ్యం కాలేదన్నారు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఈ ప్రాంతంలో లేవన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన కూచి వెంకటవిజయానందభగీరధశర్మ దంపతులు సోమవారం రూ.25వేలు విరాళం అందించారు. అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో దాత దంపతులకు దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.